RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 142

మంగళవారం
ఏప్రిల్ 29, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00




**చిల్డ్రన్ పార్క్ శుభ్రం చేయించండి సారూ..!**

4లో..

# ముందు పార్టీ నిర్ణయం..!

- తర్వాతే ప్రభుత్వ విధానం
- ఆపరేషన్ కగార్ పై సీఎం స్పష్టత
- కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు
- మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మించిన యోధురాలు లేరు
- రాహుల్ గాంధీతో గ్యాప్ ఉందన్న చర్చలో వాస్తవం లేదు





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

ఆపరేషన్ కగార్‌పై తమ పార్టీ నిర్ణయం తీసుకున్నాక ప్రభుత్వ విధానం ప్రకటిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచంలో దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మించిన యోధురాలు లేరని ప్రశంసించారు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఇందిరా గాంధీదేనని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వాళ్ల అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతారని ఆరోపణలు చేశారు. తనకు,రాహుల్ గాంధీ మధ్య మంచి రిలేషన్ ఉందని ఉద్ఘాటించారు. తాను ఎవర్నీ నమ్మించాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన స్కీంలు ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేవని తెలిపారు. సోమవారం మాజీ మంత్రి జానారెడ్డి ఇంట్లో శాంతి చర్చలపై సమావేశం జరిగింది. శాంతి చర్చలపై సీఎం రేవంత్‌రెడ్డి, జానారెడ్డి, కేకే, వేం నరేందర్ రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో ఫోన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. గతంలో శాంతి

మిగతా 4వ పేజీలో..





## భూ భారతి రైతులకు శ్రీరామరక్ష

**- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**వేద న్యూస్, భద్రాద్రి కొత్తగూడెం :**

భూ భారతి చట్టంలో ప్రతీ భూ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని..ధరణిలా ఇది నాలుగు గోడల మధ్య తెచ్చిన స్వార్థ పూరిత చట్టం కాదని..రైతులకు భూ భారతి చట్టం శ్రీరామ రక్ష అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి - 2025 చట్టంపై నిర్వహిస్తున్న

మిగతా 4వ పేజీలో..

## పోలీస్ అమరవీరుల స్మారక భవనం ప్రారంభం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అమరవీరుల స్మారక భవనాన్ని కోమటి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో పునని ర్మాణం చేసి రాష్ట్ర ఆర్ అండ్ బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కోమటి రెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ సహకారంతో అమరవీరుల స్మారక భవనాన్నీ నూతన హంగులతో తీర్చి దిద్దినందుకు జిల్లా పోలీస్ శాఖ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోమటి రెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ సీఈవో గోనా రెడ్డి,నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు,మాజీ మున్సిపల్ ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, సిఐలు రాఘవ రావు, రాజశేఖర్ రెడ్డి, ఆది రెడ్డి,రాజశేఖర్,కొండల్ రెడ్డి,ఆర్.ఐ సంతోష్, ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలయ్య



**వేద న్యూస్,**

రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో పద్మ అవార్డు విజేతలంతా కుటుంబసమేతంగా వచ్చి

మిగతా 4వ పేజీలో..

## నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు..!



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

పశువుల దహార్తిని తీర్చేందుకే వేములపల్లి మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి నీటి తొట్లను నిర్మించారు. ప్రస్తుతం ఉన్న నీటి తొట్లు కొన్ని గ్రామాలలో శిథిలావస్థకు చేరాయి. మరి కొన్ని గ్రామాలలో పూర్తిగా కనుమరుగయ్యాయి. దీంతో మూగజీవాలు మండుతున్న ఎండలకు నీటి కోసం అల్లాడుతున్నాయి. కాగా మండలంలో 10 గ్రామాలు ఉండగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుండి నీటి

మిగతా 4వ పేజీలో..



## 1,000 మందికి పైగా తిరుగు ప్రయాణం


**పాకిస్థాన్ నుంచి వాఘా ద్వారా స్వదేశానికి 1000 మందికి పైగా భారతీయులు**

**వేద న్యూస్,**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లో పర్యటిస్తున్న భారతీయులు తమ ప్రయాణాలను అర్ధాంతరంగా ముగించుకుని స్వదేశానికి తిరిగి వస్తున్నారు. గత ఆరు రోజుల్లో వెయ్యి మందికి పైగా భారతీయులు వాఘా సరిహద్దు ద్వారా భారతదేశానికి చేరుకున్నారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీసాలు రద్దు కావడంతోనే వారు తమ పర్యటనలను కుదించుకోవాల్సి వచ్చిందని తెలుస్తోంది. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత నెలకొన్న పరిస్థితుల కారణంగా, పాకిస్థాన్‌లో ఉన్న

మిగతా 4వ పేజీలో..

## త్వరలో 12 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ





**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

రాష్ట్ర నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. త్వరలోనే పోలీసు శాఖలో భారీ ఎత్తున ఉద్యోగ నియామకాలకు సన్నాహాలు చేస్తుంది. పోలీస్ విభాగంలో దాదాపు 12 వేల వరకు ఖాళీలు ఉంటాయని అంచనా. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే ప్రతిపాదనలు పంపేందుకు బోర్డు అధికారులు సిద్ధంగా ఉన్నారు. గత కొంతకాలంగా పోలీసుశాఖలో భారీగా ఉద్యోగ నియామకాలు చేపడుతున్నా.. పదవీ విరమణ ద్వారా ఏర్పడుతున్న ఖాళీలనే భర్తీ చేస్తున్నారు. 2007లో లుంబినీపార్కు, గోకుల్‌చాట్ వద్ద బాంబు పేలుళ్ల జరిగాక పోలీసు శాఖను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం ఒకేసారి 35 వేల పోస్టులను భర్తీ చేయాలని భావించింది.

మిగతా 4వ పేజీలో..




# పహల్గాం ఘటనలో మృతులకి ఘన నివాళి

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

కాశ్మీర్ లో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడికి నిరసనగా జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన భారతీయులకు నివాళులు అర్పించారు. మిర్యాలగూడలో ఉదయం 6 గంటలకు చైతన్య నగర్ లోని చౌదరి ఫంక్షన్ హాల్ లో జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగింది. ఈ కార్యక్రమంలో పతంజలి నిత్య యోగా సభ్యులు కూడా భాగస్వామ్యం అయ్యారు.జాతీయ జెండాలు పట్టుకొని ,భారత్ మాతకి జై అనే నినాదంతో క్యాండిల్స్ తో నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్,ఫౌండర్ సామాజిక కార్యకర్త డాక్టర్ మునీర్ అహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ టూరిస్టులపై దాడి పిరికిపందల చర్య అని దమ్ముంటే పాకిస్తాన్ టెర్రరిస్టులు భారత్ తో ప్రత్యక్ష యుద్ధం చేయాలని అన్నారు. అమాయకుల ప్రాణాలు తీయడం అల్లాకు ఇష్టముండదని అలాంటి వ్యక్తులను కఠినంగా శిక్షించాలని పవిత్ర గ్రంథం చెబుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.భారతీయులమైన రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న జనయేత్రీసైనికులు భారత ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయానికి అయినా సపోర్ట్ చేస్తామని,అవసరమైతే పాకిస్తాన్ తో యుద్ధానికి అయినా వెనకాడమని,ప్రాణ త్యాగాలకైనా వెనకాడ పోమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనయేత్రీ ఫౌండేషన్ నల్గొండ జిల్లా గౌరవ అధ్యక్షులు అహ్మద్,జిల్లా సెక్రెటరీ తాజ్ బాబా, జనయేత్రీ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు అమీర్ అలీ, హుస్సేన్, ప్రవీణ్, శ్రీనివాస్, యాదగిరి,మన్సూర్అలీ,పోగుల సందీప్,షాహీర్,జాకీర్,కొత్తపల్లి సైదులు, నాగేందర్, సుజాత,జ్యోతి, రమ,అలివేలు, కుమారి,బిబి, వరలక్ష్మి,మదీహా,పద్మ,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.




# అలరించిన 29వ ప్రత్యేక పాటల విభావరి

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

త్యాగరాయ గాన సభ కళా లలిత కళావేదికపై శ్రీ సుస్వరాలు అధినేత స్వరబ్రహ్మ మూర్తి శ్రీరామ్ నేతృత్వంలో 29వ ప్రత్యేక పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జరిగిన ఈ కార్యక్రమంలో మూర్తి శ్రీరామ్ ముందుగా ఆలపించిన శివ శివ శంకర భక్తవ శంకర తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సోమయాజులు, జగన్మోహన్ నన్ను పాలింపగ నడిచి వచ్చితివా, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది మూర్తి శ్రీరామ్ శ్యామలతో కలిసి నడిరేయి జాములో స్వామి నిన్ను చేయరా దిగివత్తును సోమయాజులు శ్రీదేవి పాడిన తిరుమల మందిర సుందర ఆధ్యాత్మికతను మరోసారి గుర్తు చేసింది. సుబ్బారావు అరుణ జ్యోతి కురిసింది వాన అని పాడితే సుబ్బరాజు పద్మావతి గుట్టమీద గువ్వను కూయించారు. జగన్మోహన్ శ్రీదేవి సీతమ్మ అందాలు రీటా దయాకర్ జగన్మోహన్ లంగా వోణీ అని పాడితే శ్యామల మూర్తి శ్రీరామ్ విధాత తరపున ప్రభవించినది అన్నారు. సోమయాజులు స్వప్న ఎవరి చక్కని చుక్క శ్రీమతి శ్యామల తో కలిసి ఆమె భర్త జగన్మోహన్ నాగమల్లివో తీగమల్లివో అని పాడుకున్నారు.ఈ కార్యక్రమంలో రమా సులక్షణ డాక్టర్ అంజయ్య తమ గళాలు వినిపించారు.

**– ఇదే వేదికపై ఘనంగా సింగర్ శ్యామల జన్మదిన వేడుకలు**

ఇదే వేదికపై పుట్టినరోజు జరుపుకుంటున్న సింగర్ శ్యామల పుట్టినరోజును ఘనంగా నిర్వహించి గాయని గాయకుడు వద్ద ఓహో ఒక మనసుకు నేడే పుట్టిన రోజు అని అద్భుతంగా ఆలపించి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుర కిన్నెర, శారదా వరపుత్ర, ఎస్బిఐ విశ్రాంత అధికారి చింతలపూడి త్రినాధరావు, సింగర్ శ్యామలను శాలువతో సత్కరించి మేమెంటో అందజేశారు. ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ సింగర్ శ్యామల ఇలాంటి పుట్టినరోజులు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అసాంతం మూర్తి శ్రీరామ్ నేతృత్వంలో అద్భుతంగా జరిగింది.



## ఉగ్రదాడిని నిరసిస్తూ
# కొవ్వొత్తుల ర్యాలీ



**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**

పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్గూడ మధురాపురి కాలనీలో కాలనీ వాసులు ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ మధుర నగర్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఉగ్ర మూకలను కూకటి వేళ్ళతో పికిలి వేయాలని మృతులకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మధురనగర్ కాలనీ లోని వి శ్రీనివాస్ రావు, సుధాకరాచారి, సిహెచ్ యాదగిరి, విష్ణు కాంత్, కోశాధికారి విశాల్ మణిరత్నం, రందిత్ కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేసీఆర్ లో అహంకారం..!
## – వక్కలంక శ్రీనివాసరావు

**వేద న్యూస్, రంగారెడ్డి ప్రతినిధి :**



ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ లో అదే దర్పం, అహంకారం, కనిపించాయని వరంగల్ జిల్లా ఎలకతుర్తి లో జరిగిన సభ రుజువు చేసిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ వక్కలంక శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అభివృద్ధిలోనే కాదు ప్రజాస్వామ్య పునర్జీవనంలో సైతం ప్రపంచానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదర్శం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేసీఆర్ కు ఇంకా విలన్ లాగే కనిపిస్తుంది అని, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ లేకపోతే ఆమె తెలంగాణ ఇవ్వకపోతే వందమంది కేసీఆర్ లు వచ్చిన తెలంగాణ వచ్చేది కాదని అన్నారు.భారత రాష్ట్ర సమితి హయాంలోనే కాంట్రాక్టర్లకు సర్పంచులకు బకాయిలు పేరకపోయాయని తిరిగి భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తుందని ఇంకా కలలు కంటున్నారని వెంటనే మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ పాలిట విలన్ కాంగ్రెస్ అన్న మాటలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# అండర్ 19 బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో శౌర్య కిరణ్ కు రజత పతకం

**వేద న్యూస్, హనుమకొండ :**




హనుమకొండ కు చెందిన శౌర్యకిరణ్ అండర్ 19 సింగిల్స్ విభాగంలో రజత పతాకం సాధించాడు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో వరంగల్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 25 నుంచి 27 వరకు సైప్రస్ దేశంలో జరిగిన జూనియర్ ఇంటర్నేషనల్ 2025 పోటీల్లో హనుమకొండకు చెందిన శౌర్య కిరణ్ అండర్ 19 సింగిల్స్ విభాగంలో రజత పతకం సాధించాడు. అంతర్జాతీయ టోర్నీలో పతకం సాధించిన శౌర్య కిరణ్ ను ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు, తల్లితండ్రులు, పలువురు అభినందించారు.

# ప్రమాదంపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే

**– యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్**

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ నియోజకవర్గంలోని వీర్ల పాలెం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే ప్లాంట్ ను సందర్శించి, పరిశీలించిన మిర్యాలగూడ శాసనస భ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. ప్రమాదం జరిగిన తీరుపై, ప్రమాద తీవ్రత పై అధికారులను ఆరా తీయడం జరిగిం ది.అధికారులతో మాట్లా డుతూ యూనిట్ వన్ లోని బాయిలర్ వద్ద గ్యాస్ కట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీక్ కావడంతో మంటలు చెలరేగినట్లు వెల్లడించారు.మిగిలిన మూడు బాయిలర్లు రన్ చేయడంలో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు.త్వరితగతన ప్రమాదానికి గురైన బాయిలర్ గ్యాస్ కట్ ను రిపేరు చేయాలని అధికారులను ఎమ్మెల్యే బిఎల్ఆర్ ఆదేశించారు.బాయిలర్ రిపేరు చేసి 24 గంటల్లోపు రన్నింగ్ లోకి తీసుకువస్తామని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరు కూడా ఆందోళన చెందవద్దని,ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని,కార్మికులకు కూడా ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు.


# నిస్వార్థ సేవకు దాసరి స్వప్న మహేష్‌కు ఘన సన్మానం




**వేద న్యూస్, జ్యోతినగర్,ఎన్టీపీసీబీ**

ప్రేమ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి స్వప్న మహేష్ నిస్వార్థ సేవలకు గుర్తింపుగా అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ కళా సంస్థ "కళ దర్బార్" వారి స్వర్ణ ఉత్సవాలు (50వ వార్షికోత్సవ వేడుకలు) రవీంద్రభారతి హాల్లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులు, ప్రముఖ వ్యాపారవేత్తలు సుధాకర్ పైప్స్ యజమాని, క్రేన్ వక్కపొడి యాజమాన్యం, సాఫ్ట్‌వేర్ దెవలపర్లు మరియు సినిమా ప్రముఖులు బాబు మోహన్, శ్రీకాంత్, సాయికుమార్, అలీ, రాజా బాబు, రాజీవ్ కనకాల తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కళ దర్బార్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. పొత్తూరి రంగారావు దాసరి స్వప్న మహేష్ అందిస్తున్న సామా జిక సేవలను, కళా సేవలను ప్రశంసించారు. అనంతరం ప్రముఖ యాక్టర్లు బాబు మోహన్, అలీ, సాయికు మార్, రాజా బాబుల చేతుల మీదుగా దాసరి స్వప్న మహేష్ ఘనంగా సత్కరిం చారు. ఈ సందర్భ ంగా దాసరి స్వప్న మహేష్ మాట్లాడుతూ, "నా సేవలకు గొప్ప గుర్తింపు ఇచ్చిన కళ దర్బార్ సంస్థకు మరియు ప్రముఖ అతిథులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

# పండ్ల బండ్లకి మున్సిపల్ జరిమానా



వేద న్యూస్ కోరుట్ల ప్రతినిధి

మెట్ పల్లి పట్టణములో మున్సిపల్ కమిషనర్ తోగిటి మోహన్ నేషనల్ హైవే రోడ్లపై అరటి పండ్ల బండ్లు, కరబూజ బండ్లు రోడ్లపై పెట్టి ప్రజలకు ఇబ్బంది ఇబ్బంది కలిగిస్తున్న వారికి రూ. 2వేలు విధించారు. కమిషనర్ మాట్లాడుతూ, అరటిపండ్ల బండ్లు, కరబూజ బండ్లు, జ్యూస్ పాయింట్లు రోడ్లపై ముందుకు వచ్చి బండ్లు పెట్టి ప్రజలకు ట్రాఫిక్ కీ ఇబ్బంది చేసినచో మున్సిపల్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొని జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. దుకాణంలో ఉండే వస్తువులను బయటపెట్టి ప్రజలకు ఇబ్బంది చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకొనబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నాయక్, మహిపాల్, లింబయ్య పాల్గొన్నారు.

# క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి

**– ఎస్సై డి వెంకటేశ్వర్లు**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



మంచి మార్గం వైపు పయనిస్తే సమాజంలో ఉన్నత స్థానాన్ని అధిరోహించవచ్చని వేములపల్లి ఎస్సై డి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం వేములపల్లి మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్నేహపూర్వక క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు. క్రీడలలో గెలుపు సమానంగా స్వీకరించాలన్నారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని యువతకు సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచి స్నేహాన్ని అలవర్చుకోవాలన్నారు. అంతకుముందు రావులపెంట గ్రామానికి చెందిన సీనియర్ క్రీడాకారుడు మర్రి యేసు రత్నం చిత్రపటానికి పూలమాలవేసి కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం ఎస్సై ని క్రీడాకారులు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి,మర్రి ఎలియాస్,మాజీ ఎంపీటీసీ నంద్యాల శ్రీరామ్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ తరి సైదులు, కందుల పెద్ద నాగిరెడ్డి, బీరవెల్లి సతీష్ రెడ్డి, మర్రి ఆనందం,చంద్రయ్య,వెంకట్ రెడ్డి,అశోక్,కత్తుల సైదులు,శివారెడ్డి,పీఈటీలు దేవేందర్ రెడ్డి, జనార్ధన్, ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అక్షరమా..!

మనిషి తెలివిమీరిన చేష్టలు చేస్తూ..
పకృతి మాతకు విఘాతం కలిగిస్తూ..
రకరకాల ఉడుపులతో వేషధారణ చేస్తూ..
మతిమాలిన మితిమీరిన తెలివితేటలతో సంస్కృతి సంప్రదాయాలను నాశనం చేస్తూ..
కాయంలో ప్రాణం పోయాక
ఒక్క క్షణం కూడా ఇంట్లో
ఉంచుకోని బంధాలు కోసం అబద్ధాలు, మోసాలు చేస్తూ..
కళేబరాలతో కల్తీ నూనెలు తయారు చేస్తూ..
రాజ్యం ఏలుతున్న
దుష్ట నికృష్ట రక్కసులను
నామరూపాలు లేకుండా
చేసే అణ్వాయుధమైపో
అక్షరమా..!



గుంట నక్కల
మాయతెరల వెనుక
కృంగుతున్న...కనులుండీ
కబోదులుగా మారుతున్న ప్రతి
మనిషి లోని అజ్ఞాన
తిమిరాలను సంహరణ చేసి
వారి జీవితాల్లో చిరుదీపమై
వెలిగేట్లు చేయి అక్షరమా..!

**మంజుల పత్తిపాటి (కవయిత్రి),**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్**

# జర్నలిస్టులకు ప్రత్యేకంగా రుణాలు కేటాయించాలి

### – రాజీవ్ యువ వికాస పథకంలో



వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో ఎలాంటి జీత భత్యాలు లేకుండా నిత్యం ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిస్వార్థంగా సేవ చేస్తున్న జర్నలిస్ట్ లకు ప్రత్యేకంగా రుణాలను కేటాయించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ టీఎస్ జేయు ఎన్ యు జె (ఐ) కోరుట్ల నియోజకవర్గ ఉపాధ్యక్షులు పటాన్ ఫేరోజ్ ఖాన్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే గొప్ప ఉద్దేశం తో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం ఉన్నత చదువులు చదివి జర్నలిస్ట్ వృత్తిలో కొనసాగుతున్న వారికి ప్రత్యేక అవకాశం కల్పించినట్టైతే వారిని ఆర్థిక అభివృద్ధికి ప్రోత్సాహించినట్టు అవుతుందని అన్నారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా జర్నలిస్ట్ జీవితాలు మారలేదన్నారు. ఈ ప్రజా ప్రభుత్వంలో రాజీవ్ యువ వికాసం పథకంలో జర్నలిస్టుల కు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.


# చెట్టెక్కి పహల్గామ్ మారణహోమం చిత్రీకరించిన ఫోటోగ్రాఫర్

**వేద న్యూస్,**

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఘోర ఉగ్రదాడి కేసులో ఊహించని వ్యక్తి కీలక సాక్షిగా మారాడు. హనీమూన్ జంటలు, పర్యాటకులకు అందమైన రీల్స్ చేస్తూ పేరుగాంచిన ఒక స్థానిక ఫోటోగ్రాఫర్, ఇప్పుడు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు అత్యంత ముఖ్యమైన ఆధారాలు అందించాడు. ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించగానే ప్రాణభయంతో పరుగెత్తి, సమీపంలోని ఓ చెట్టు ఎక్కిన ఆ ఫోటోగ్రాఫర్, అక్కడ నుంచే కింద జరుగుతున్న మారణహోమాన్ని తన కెమెరాలో బంధించాడు. ఏప్రిల్ 22న పహల్గామ్ సమీపంలోని ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన బైసరన్ మైదానంలో ఈ ఘోరం జరిగింది. సాధారణంగా కొత్త జంటలు, పర్యాటకులతో కళకళలాడే ఈ ప్రశాంత ప్రదేశంలో, ఆనంద క్షణాలను చిత్రీకరించే ఈ ఫోటోగ్రాఫర్.. అనుకోకుండా భయానక దృశ్యాలను రికార్డ్ చేయాల్సి వచ్చింది. ఉగ్రవాదులు కాల్పులు జరుపుతుండగా, అతను ధైర్యం చేసి చెట్టుపై నుంచి వీడియో తీశాడు. ప్రస్తుతం అతని భద్రత దృష్ట్యా వివరాలను గోప్యంగా ఉంచారు. ఈ ఫోటోగ్రాఫర్ తీసిన వీడియోలు ఎన్ఐఏ దర్యాప్తునకు అమూల్యమైనవిగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు. దాడి జరిగిన తీరును పునర్నిర్మించడానికి, ఉగ్రవాదులను గుర్తించడానికి ఈ దృశ్యాలు సహాయపడతాయని భావిస్తున్నారు. దర్యాప్తు ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇద్దరు ఉగ్రవాదులు దుకాణాల వెనుక నుంచి హఠాత్తుగా బయటకు వచ్చి, కొందరు బాధితులను 'కల్మా' చదవమని ఆదేశించి, పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో కాల్చి చంపారు. దీంతో పర్యాటకులు భయంతో పరుగులు తీశారు. అదే సమయంలో జిప్‌లైన్ ప్రాంతం నుంచి మరో ఇద్దరు ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. మొత్తం నలుగురు ఉగ్రవాదులు (ముగ్గురు పాకిస్థానీయులు, ఒక స్థానికుడు ఆదిల్ థోకర్) ఈ దాడిలో పాల్గొన్నట్లు సమాచారం. దాడికి ముందు ఈ ఉగ్రవాదుల బృందం సుమారు 22 గంటల పాటు అటవీ ప్రాంతంలో నడిచి, పహల్గామ్ లోయలోకి ప్రవేశించినట్లు విచారణలో వెల్లడైంది.

# ధర్మల్ పవర్ ప్లాంట్ లో అగ్నిప్రమాదం..!

**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**



మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలోని వీర్లపాలెం గ్రామంలోని యాదాద్రి ధర్మల్ పవర్ ప్లాంట్ లో సోమవారం ఉదయం సుమారు రెండు గంటల ప్రాంతంలో అగ్ని ప్రమాదం జరిగింది.యూనిట్ వన్ లో ట్రైల్ రన్ నిర్వహిస్తున్న సందర్భంగాబాయిలర్ నుండి ఆయిల్ లీకేజీ అయ్యి కింద వెల్డింగ్ పని చేస్తున్నటువంటి ప్రాంతంలో పడింది.మంటలు 30 అడుగుల మేర చెలరేగాయి,తక్షణమే స్పందించిన కార్మికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు.అధికారులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా కార్మికులు,ఫైర్ సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.వచ్చే మే నెలలో యూనిట్ -1 బాయిలర్ ను పూర్తిస్థాయిలో అందుబాటులో తెచ్చే ప్రయత్నంలోనే రెండు రోజుల నుండి ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు అధికారులు తెలియజేస్తున్నారు.ట్రయల్ రన్ లో భాగంగా ఇలాంటి ప్రమాదాలు సహజమేనని అధికారులు తెలియజేస్తున్నారు.తద్వారా ఎక్కడ తప్పులు జరుగుతున్నాయో తెలుసుకొని పూర్తిస్థాయిలో విజయవంతంగా రన్ చేయడానికి అవకాశం ఏర్పడుతుందని ప్లాంట్ అధికారులు తెలుపుతున్నారు.

## గాయని మద్ది పద్మకు వెలుగు కళా,

# సేవారత్న పురస్కారం ప్రదానం.

**వేద న్యూస్,జ్యోతినగర్,ఎన్టీపీసీ:**



వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని పట్టణంలోని మార్కండేయ కాలనీ ఆదిత్య రెసిడెన్సీలో ఉగాది పురస్కారాల పండుగ సందర్భంగా అవార్డు ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గాయని మద్ది పద్మకు ఆమె గాత్ర ప్రతిభను గౌరవిస్తూ "కళా రత్న" పురస్కారంతో పాటు, సమాజానికి అందిస్తున్న సేవల కోసం "సేవారత్న" పురస్కారాన్ని ప్రదానం చేశారు. వెలుగు సంస్థ అధ్యక్షుడు లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ నేతృత్వంలో, ప్రముఖ అతిథుల చేతుల మీదుగా ఈ జాతీయ స్థాయి అవార్డులు బహుకరించారు.ఈ సందర్భంగా సింగర్ మధుప్రియ తల్లి పెద్దింటి సుజాత, గాయకుడు తెల్లం మురళి మధు, వెలుగు సంస్థ సభ్యులు పాల్గొన్నారు. అవార్డు అందుకున్న మద్ది పద్మ మాట్లాడుతూ, నా కళను గుర్తించి కళా, సేవారత్న అవార్డులతో గౌరవించిన వెలుగు సంస్థకు, అధ్యక్షులు సురభి శ్రీధర్ కు సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మేడే కరపత్రాల పంపిణీ

**వేద న్యూస్,జ్యోతినగర్,ఎన్టీపీసీ :**




మే 1వ తేదీన జరగబోయే కార్మిక హక్కుల దీక్ష దినం సందర్భంగా, 139వ మేడే కార్యక్రమంలో ఆయిల్ సెక్టార్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొనీ విజయవంతం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మేడే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన సిఐటియు జిల్లా కోశాధికారి ఎం. రామాచారి మాట్లాడుతూ"చికాగో పోరాటం ద్వారా 8 గంటల పని దినం సాధించి పెట్టిన గొప్ప సంఘటనకు 139 సంవత్సరాలు పూర్తవుతున్నాయన్నారు. ఈ మేడే రోజున కార్మికుల పోరాట స్ఫూర్తిని గుర్తించాలి" అని పేర్కొన్నారు. కార్మిక హక్కుల రక్షణ కోసం మే 1న ఆయిల్ సెక్టార్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.అలాగే, కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను పరిరక్షించేందుకు మే 20న నిర్వహించే జాతీయ సమ్మెలో కూడా పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎం. రామాచారి, రవీందర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్,**

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై భారత ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటోన్న వేళ, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌తో పాటు బంగ్లాదేశ్‌పై కూడా దృష్టి సారించాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక అధికారిక కార్యక్రమంలో మీడియాతో మాట్లాడుతూ, "భారత్ బంగ్లాదేశ్‌పై కూడా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ వ్యూహాత్మక నిర్ణయాలు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చర్యలను పరిశీలిస్తుందని భావిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. నదీ జలాల పంపకాల విషయంలో హిమంత బిశ్వ శర్మ మరింత ఘాటుగా స్పందించారు. గతంలో తీస్తా నదీ జలాల ఒప్పందాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యతిరేకించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బ్రహ్మపుత్ర నది నీటిని కూడా బంగ్లాదేశ్‌కు వెళ్లకుండా నిలిపివేయాలని ఆయన సూచించారు. "ఎంతకాలం మనం ఇలాంటి పాములకు నీళ్లు అందిస్తాం? వాటిని అణచివేయాల్సిన సమయం వచ్చింది" అని ఆయన అన్నారు. గంగా, బ్రహ్మపుత్ర నదీ జలాల ఒప్పందాలను రద్దు చేసే విషయంలో దేశ ప్రజలు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షాలపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని, వారు తగిన చర్యలు తీసుకోవాలని శర్మ కోరారు.

పాకిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య పెరుగుతున్న సన్నిహిత సంబంధాలపై తాను ముందే అధికారులను అప్రమత్తం చేశానని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గత వారం వ్యాఖ్యానించారు. బీజేపీ నేత, ఎంపీ నిశికాంత్ దూబే కూడా ఇదే విధమైన ఆందోళన వ్యక్తం చేశారు. లష్కరే తోయిబా



ఉగ్రవాదులు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని ఆయన ఆరోపించారు. ఉగ్రవాదుల చొరబాట్లను అరికట్టేందుకు భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన తరహాలోనే, 1996లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బంగ్లాదేశ్‌తో కుదుర్చుకున్న గంగా జలాల ఒప్పందాన్ని కూడా రద్దు చేయాలని నిశికాంత్ దూబే డిమాండ్ చేశారు.

# సాగునీటి వివక్షతపై ఎలుగెత్తి చాటిన విద్యాసాగర్ రావు

వలస పాలకుల స్వార్థ పాలనలో, సాగు నీటి రంగంలో జరిగిన అన్యాయాలు, ప్రాజెక్టుల్లో మోసంపై గణాంకాలతో తెలంగాణ జాతిని జాగృతం చేసిన గొప్ప వ్యక్తి విద్యాసాగర్ రావు. తెలంగాణకు నీటి విషయంలో జరిగిన మోసం, ప్రాజెక్టులపై జరిగిన అన్యాయం పై విద్యాసాగర్‌రావు చేసిన పోరాటం, అధ్యయనం అనన్య సామాన్యం. సాగునీటి రంగలో నిపుణులైన విద్యాసాగర్ రావు ఉమ్మడి రాష్ట్రంలో తెలం గాణకు నీటి కేటాయింపుల విషయంపై జరిగిన అన్యాయం పై ఎలుగెత్తి చాటారు. నీటి పారుదల శాఖలో వివిధ పదవులలో, హోదా లలో పని చేసిన ఆయన, టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు ప్రాజెక్టులు, నీటి కేటాయింపు లపై ఎప్పటికప్పుడు సమాచారం, సలహాలు ఇస్తూ సందేహాలను నివృత్తి చేసేవారు. సాగునీటి రంగంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని ఆయన ఆధార సహితంగా, బహిర్గత పరిచి, ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ను ప్రేరేపించడంలో, ఉద్యమ తెరాస పార్టీ అధినేతకు వెన్ను దన్నుగా ఉన్నారు. అలా కేసీఆర్‌కు ఉన్న అతి దగ్గర వ్యక్తులలో విద్యాసాగర్ రావు ఆంతరంగిక ముఖ్యులలో ఒకరై పోయారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తన పరి జ్ఞానంతో కొత్త ప్రాజెక్టుల రూప కల్పనలో ఆయన భాగస్వామ్యం విడదీయ జాలనిది, ఆయన పాత్ర నిజంగా మరువలేనిది..

"జయశంకర్ తర్వాత తెలంగాణ జాతికి దక్కిన మరో గొప్ప తెలంగాణ మహాను భావుడు విద్యాసాగర్ రావు" అని కేసీఆర్ చేత ప్రశంసింప బడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ ఆయన. ఆర్. విద్యాసాగర్‌రావు (14 నవంబరు 1939–2017 ఏప్రిల్ 29) తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ జిల్లాకు చెందిన జాజిరెడ్డి గూడెం గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, రాఘవరావు దంపతులకు విద్యా వంతుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న స్థితి, వారి కుటుంబంలో అందరికీ చదువు పట్ల ఆసక్తి కలగడానికి హేతువైంది. వారి గ్రామంలో తొలిసారిగా మెట్రిక్యులేషన్ చేసిన వ్యక్తి రాఘవరావు కాగా, మొదటి పట్టభద్రులు రాఘవరావు పెద్ద కుమారుడు, మొట్ట మొదటి ఇంజనీరింగ్ పట్టభద్రుడు విద్యాసాగర్‌రావు కావడం విశేషం. విద్యాసాగర్ రావు 1960లో హైదరాబాదు లోని ఉస్మానియా విశ్వ విద్యాలయము నుండి ఇంజనీరింగ్ లో పట్టభద్రు లయ్యారు. 1979 లో రూర్కీ విశ్వ విద్యాలయం (ప్రస్తుతం ఐఐటి రూర్కీ) లో నీటి వనరుల అభివృద్ధిలో మాస్టర్స్ డిగ్రీని పొందారు. ఆయన 1983లో అమెరికా లోని కొలోరాడో స్టేట్ విశ్వ విద్యాలయం నుండి నీటి వనరుల వ్యవస్థ ఇంజనీరిం గులో డిప్లొమా పొందారు. ఆయన 1990లో ఢిల్లీ విశ్వ విద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో పట్టాను కూడా సంపాదించారు. బీటెక్ పూర్తి అయిన వెంటనే క్యాంపస్‌లోని మహిళా కాలేజీ మెయింటెనెన్స్ ఇంజీనీరుగా ఉద్యోగంలో చేరారు. కళల పట్ల ఆసక్తి కలిగిన ఆయన, ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా రాయటం, నాటకాలు వేయడం వంటి హాబీ లకు దూరం కాలేదు. అను దినం సాయంత్రం విధుల నిర్వహణ అనంతరం రవీంద్ర భారతికి వెళ్ళేవారు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి, అనంతరం ఢిల్లీకి వెళ్లారు. కేంద్రంలో మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్, నీటిపారుదల శాఖలో ఇంజ నీరుగా పనిచేశారు. ఢిల్లీలో ఉన్న సమయంలో సాగునీటి విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసు కున్నారు. ఉద్యోగం నుండి విశ్రాంతి పొందాక, తరువాత తిరిగి హైదరాబాద్ వచ్చారు. దాదాపు 34 సంవత్స రాల పాటు కేంద్ర జల సంఘం లోనే విధులు నిర్వహించడం తో ఆయన దేశ వ్యాప్తంగా జల వనరుల అంశంపై అపారమైన అనుభవం గడించారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల విషయాలపై సమగ్ర అవగా హన, సరైన ఆలోచనను కలిగి ఉండేవారు. 2016 నవంబ రులో కాకతీయ విశ్వ విద్యాలయంచే నిర్వహించ బడిన "మిషన్ కాకతీయ" ప్రాజెక్టుకు సంబంధించిన సెమినార్ లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఆయన ప్రసంగంలో వ్యవసాయ రంగంలో నీటి పారుదల ప్రాజెక్టు లపై ప్రభుత్వ విధానాలను సమగ్రంగా వివరించారు.2014లో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (భారత దేశం) ఆయనను "లీడింగ్ ఇంజ నీరింగ్ పెర్సనాలిటీస్ ఆఫ్ ఇండియా"గా గుర్తించి, పురస్కార గ్రహీతను చేసింది. ఆయన ఎన్నో రచనలు చేశారు. పత్రికల్లో రాసిన వ్యాసాల న్నింటినీ కలిపి.. 'నీళ్లు–నిజాలు' పేరుతో పుస్తక రూపంలో ప్రచురించారు. అలా "నీళ్ళు నిజాలు విద్యాసాగర్ రావు"గా పేరెన్నిక గన్నారు. ఎన్. శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'జై బోలో తెలంగాణ' చిత్రంలో ఉచిత పాత్రలో నటించారు. ఐక్యరాజ్య సమితి ఇన్విరాన్ మెంటల్ ప్రోగ్రామ్‌లో సభ్యు డిగా, సెంట్రల్ వాటర్ కమి షన్‌లో చీఫ్ ఇంజనీర్‌గా సేవలు అందించిన విద్యాసాగర్ రావు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. 12వ పంచవర్ష ప్రణాళిక రూపకల్పన లోనూ సలహాలు అందించారు. సాగునీటి రంగ రిటైర్డ్ చీఫ్ ఇంజినీరుగా, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల సలహాదారుగా సుపరిచితులు అయిన విద్యా సాగర్‌రావు రచయితగా, నటునిగా చూపిన ప్రతిభ గురించి చాలా మందికి తెలియదు. గిరీషం కలం పేరుతో ఆయన రాసిన రచనలు అనేక పత్రికల్లో ప్రచురించారు. బాల్యంలో కవి సమ్మేళనాలు, నాటకాల ప్రదర్శనలకు వెళ్లేవారు. కాలేజ్ స్థాయి వివిధ పోటీల్లో పాల్గొని, నాటకాలు కూడా వేసేవారు. కొంతకాలం అనారో గ్యానికి గురై, 2017 ఏప్రిల్ 29న హైదరాబాద్‌లో దివంగ తులైనారు.

వేద న్యూస్

మంగళవారం ఏప్రిల్ 29, 2025

## భూ భారతి రైతులకు శ్రీరామరక్ష

మొదటి పేజీ తరువాయి

అవగాహన సదస్సుల్లో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ చట్టం చేసేముందు రైతుల కష్టం గురించి ఆలోచించి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీ సూచనలను పరిగణనలోకి తీసుకొని రైతులకు శ్రీరామరక్షలా నిలిచే విధంగా భూభారతి -2025 చట్టాన్ని రూపొందించామని తెలిపారు. గతంలో నాలుగు గోడల మధ్య స్వార్ధపూరితంగా తయారుచేసిన ధరణి చట్టానికి మూడేళ్లు గడిచినా నియమనిబంధనలు రూపొందించలేదని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మండలాల్లో తొలివిడత ప్రయోగాత్మకంగా అమలు చేసి అన్ని వివరాలు, దరఖాస్తులు సేకరిస్తున్నామని, జూన్ 2 నాటికి వీలైనన్ని సమస్యలు పరిష్కరించి, అర్హులైన వారికి అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను పట్టాలుగా అందజేస్తామని తెలిపారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు వివరించారు. భూ యజమానులకు న్యాయం జరిగేలా తహశీల్దార్ మొదలు కొని సీసీఎల్ఏ వరకు ఐదంచెల వ్యవస్థను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. సీసీఎల్ఏ వద్ద కూడా న్యాయం జరగలేదని భావిస్తే ట్రిబ్యునల్ ను ఆశ్రయించవచ్చన్నారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అవసరమైనన్ని ట్రిబ్యునల్స్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీకల్లా రెవెన్యూ ,గ్రామ పరిపాలనాధికారులు ప్రజలకు పూర్తిగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తప్పుచేసే అధికారులపై చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. గతంలో రైతు బంధు కోసం గులాబీ రంగు కార్యకర్తలకు భూమి లేకపోయినా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని, సక్రమంకాని అటువంటి అక్రమాలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు మరిన్ని సేవలు అందేలా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందని ఏ పార్టీ కార్యకర్త అనే పక్షపాతం లేకుండా ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు చట్టం ఒక చుట్టంలా ఉపయోగపడేలా చూస్తామని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## అల్లాడుతున్న మూగజీవాలు..!

మొదటి పేజీ తరువాయి


తొట్లను నిర్మించారు. ప్రస్తుతం బానుడు భగభగ మండుతుంటే మూగజీవాలకు నీరు లేక మృత్యువాత సంఘటనలు లేకపోలేదు. మండలంలో కొన్ని గ్రామపంచాయతీలో మాత్రమే పశువుల కోసం ఒకటి, రెండు నీటి తొట్టెలను నిర్మించారు. వాటి నిర్మాణాల కోసం ఉపాధి హామీ పథకం నిధుల నుండి లక్షల రూపాయలను ఖర్చు చేశారు. అయినప్పటికీ కొన్ని గ్రామాలలో ఉపయోగకరంగా ఉండడం, మరికొన్ని గ్రామాలలో అధికారుల పట్టింపు లేక కనుమరుగు కావడంతో నూతనంగా నీటి తొట్టెలను నిర్మించాలని ప్రజలు, రైతులు అభిప్రాయపడుతున్నారు. ఆమనగల్లు గ్రామంలో నీటి తొట్టెలు లేకపోవడంతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. విషయం తెలుసుకున్న ఆమనగల్ గ్రామానికి చెందిన గడ్డం దేశ్ముఖ్ విష్ణు స్వరూప్ రెడ్డి పశువులు దప్పికకు అల్లాడద్దనే ఉద్దేశంతో సొంత వ్యయంతో నీటి తొట్టిని నిర్మించారు. ప్రస్తుతం ఆయన నిర్మించిన నీటి తోట్టి కూడా పూర్తిగా ధ్వంసం అయింది . ప్రస్తుతం గ్రామంలో నీటి తొట్టెలు లేకపోవడంతో పశువులు మృత్యువాత పడే అవకాశం లేకపోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉపాధి హామీ పథకం నిధుల నుండి, ఎవరైనా దాతలు ముందుకు వచ్చి గ్రామంలో నీటి తొట్టెలను నిర్మించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా మండలంలోని ప్రతి గ్రామానికి ఉపాధి హామీ నిధుల నుండి నీటి తొట్టెలను మరిన్ని నిర్మించాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.

## త్వరలో 12 వేల పోలీసు ఉద్యోగాల భర్తీ

కానీ ఒకేసారి ఇన్ని పోస్టులను భర్తీ చేయడం అసాధ్యం. అందుకే విడతలుగా పోలీస్ శాఖలో నియామకాలు చేపడుతున్నారు.

అయితే కొన్ని సకాలంలో భర్తీ చేసినా.. కొన్ని రిక్రూట్మెంట్లు మాత్రం వివిధ కారణాలతో వాయిదా పడుతున్నాయి. చివరిసారిగా తెలంగాణలో పోలీస్ నియామకాలు 2022 సంవత్సరంలో పూర్తి చేసింది. నాటి నోటిఫికేషన్లో మొత్తం17 వేల పోస్టులను తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి భర్తీ చేసింది. 2022లో చేపట్టిన నియామక ప్రక్రియలో ఎంపికై, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 2024లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నియామకపత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా మరోసారి భారీ ఎత్తున పోలీస్ నియామకాల భర్తీకి అధికారులు సన్నద్ధం అవుతున్నారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం.. కానిస్టేబుల్, ఎస్సై స్థాయి పోస్టులు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 12 వేల వరకు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ పోస్టులు మరికాస్త పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచుతూ 2021 ఏప్రిల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆ ఏడాది పదవీ విరమణ చేయాల్సి వారు 2024 మార్చి వరకు పొడిగించారు. 2024 ఏప్రిల్ నుంచి మళ్లీ ఉద్యోగ విరమణలు ప్రారంభమైనాయి. ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తే.. వెంటనే నియామక ప్రారంభించేందుకు తెలంగాణ రాష్ట్ర పోలీసు నియామక మండలి కూడా సిద్ధంగా ఉంది.




# ముందు పార్టీ నిర్ణయం..!

మొదటి పేజీ తరువాయి

చర్చల సమయంలో ఉమ్మడి ఏపీ పార్టీ ఇన్చార్జిగా దిగ్విజయ్ సింగ్ ఉన్నారు. ఈ సమావేశం అనంతరం శాంతి చర్చలపై మీడియాతో సీఎం రేవంత్రెడ్డి మాట్లాడారు. గతంలో శాంతి చర్చలు జరిగినప్పటి విషయాలను అధ్యయనం చేస్తున్నామని అన్నారు. ఈ విషయంపై కేకే, జానారెడ్డి, దిగ్విజయ్ సింగ్లతో చర్చించినట్లు తెలిపారు. జాతీయ పార్టీలో జాతీయ విధానం ఉంటుందని స్పష్టం చేశారు. కగార్ అంశంపై జాతీయ స్థాయిలో చర్చ జరగాలని సీఎం రేవంత్రెడ్డి చెప్పారు.

**– కేసీఆర్, బీఆర్ఎస్ నేతలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు : సీఎం**

వరంగల్ లో జరిగిన కేసీఆర్ సభపై రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రసంగంలో స్పష్టత లేదని, అభద్రతా భావంతో అక్కసు వెళ్లగక్కారని ఆరోపించారు. కేసీఆర్ ఎన్ని చెప్పినా బీఆర్ఎస్ ను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. కేసీఆర్, మోదీ తమ అవసరాలకు అనుగుణంగా మాటలు మారుస్తున్నారని విమర్శించారు.

రాహుల్ గాంధీకి, తనకు గ్యాప్ ఉందన్న చర్చలో వాస్తవం లేదని, అయితే తమ సంబంధాన్ని బయటి ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొందరు ఎమ్మెల్యేలు ఎంత చెప్పినా హైదరాబాద్లోనే టైమ్ పాస్ చేస్తున్నారని, ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ పథకాలు వివరించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీలో ఓపికగా ఉంటేనే పదవులు వస్తాయని, తొందరపడి ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే నష్టపోతారని హెచ్చరించారు.

**– మరో ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటా**

అధికారుల్లో తమ వారు, వేరే వాళ్లు అంటూ ఉండరని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. సమర్థత ఉన్న అధికారులను గత ప్రభుత్వంలో కీలకంగా ఉన్నప్పటికీ కొనసాగించక తప్పదని సీఎం అన్నారు. కొందరు



అధికారులు సంపాదనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఎన్నికలకు చివరి 6 నెలలు తన పాలనపై చర్చ జరుగుతుందని అన్నారు. మరో ఇరవై ఏళ్లు తాను రాజకీయాల్లో ఉంటానని రేవంత్రెడ్డి వ్యాఖ్యానించారు. అరెస్టుల విషయంలో తొందరపడమని, చట్ట ప్రకారమే నడుచుకుంటామని సీఎం స్పష్టం చేశారు.

# చిల్డ్రన్ పార్క్ శుభ్రం చేయించండి సారూ..!

**-పిచ్చి మొక్కలు..ముళ్ల చెట్లతో దర్శనం -వాకర్స్ కి తప్పని తిప్పలు -అధికారులు స్పందించి..శుభ్రం చేయాలని విజ్ఞప్తి**






**వేద న్యూస్,మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ-2 లో బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ నిధులతో మున్సిపల్ అధికారులు అమృత్ పథకంలో భాగంగా "చిల్డ్రన్ పార్క్" ను ఏర్పాటు చేశారు.కానీ ప్రస్తుతం ఇందిరమ్మ కాలనీలో ఈ చిల్డ్రన్ పార్క్ లో మాత్రం పిచ్చి మొక్కలు,ముళ్ల చెట్లు మాత్రం దర్శనం ఇస్తున్నాయి. వేసవిలో చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు పార్క్ ఉన్నా సదుపాయాలు సున్నా. ప్రతీ రోజూ ఉదయం,సాయంత్రం వాకర్స్ వ్యాయామాలకు వెళ్లాలంటే ఈ పార్క్ అధ్వాన్నంగా ఉందని,చెత్త,చెదారం,ముళ్ల చెట్లతో దర్శనం ఇస్తున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. చిల్డ్రన్ పార్క్ ఉంది కానీ సౌకర్యాలు మాత్రం నిల్ అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వెంటనే ప్రజాప్రతినిధులు,మున్సిపల్ అధికారులు స్పందించి,పార్క్ ను శుభ్రం చేసి,అందరికీ మంచి ఆరోగ్యాన్ని కల్పించే అహ్లాదకర వాతావరణం కల్పించాలని చిన్న పిల్లలకు ఆడుకునేందుకు సరైన సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

# పద్మ భూషణ్ అవార్డు అందుకున్న బాలయ్య

అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఏడుగురికి ఈ ఏడాది 'పద్మ' అవార్డులు దక్కాయి. వైద్య విభాగంలో దువ్వూరి నాగేశ్వర్రెడ్డికి పద్మ విభూషణ్, సినీ రంగం నుంచి నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్, ప్రజా వ్యవహారాల విభాగంలో మందకృష్ణకు పద్మశ్రీ, విద్య, సాహిత్యం విభాగంలో కేఎల్ కృష్ణకు పద్మశ్రీ, కళారంగంలో మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ, కళారంగంలో మిరియాల అప్పారావుకు పద్మశ్రీ, విద్య, సాహిత్యం విభాగంలో రాఘవేంద్రాచార్యకు పద్మశ్రీ పుర్కస్కారాలు అందుకున్నారు. పద్మ అవార్డులు దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటి. పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అనే మూడు విభాగాలలో వీటిని ప్రదానం చేస్తారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, వాణిజ్యం, పరిశ్రమలు, వైద్యం, సాహిత్యం, విద్య, క్రీడలు, ప్రజా సేవ మొదలైన వివిధ విభాగాలు.. కార్యకలాపాల రంగాలలో ప్రతిభ కనబరచినవారికి ఈ అవార్డులు ఇస్తారు. అసాధారణమైన, విశిష్ట సేవలకు 'పద్మ విభూషణ్'ను ప్రదానం చేస్తారు. ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు 'పద్మభూషణ్', ఏ రంగంలోనైనా విశిష్ట సేవలందించిన వారికి 'పద్మశ్రీ' అవార్డులు ప్రదానం. ప్రతి



ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుల విజేతల్ని ప్రకటిస్తారు. 2025 సంవత్సరానికిగాను రాష్ట్రపతి 139 మంది ప్రముఖులకు పద్మ పురస్కారాలను ఇవాళ ప్రదానం చేశారు. మొత్తంగా 7 పద్మ విభూషణ్, 19 పద్మ భూషణ్, 113 పద్మ శ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈ పురస్కార గ్రహీతలలో 23 మంది మహిళలు ఉండగా, 10 మంది విదేశీయులు/ఎన్ఆర్ఐ/పీఐఓ/ఓసీఐ వర్గానికి చెందినవారు. 13 మంది మరణాంతర పురస్కార గ్రహీతలు కూడా ఉన్నారు.

# 1,000 మందికి పైగా తిరుగు ప్రయాణం

భారతీయుల వీసాలపై ప్రభావం పడింది. దీనితో అక్కడ వివిధ పనులపై వెళ్లిన వారు, యాత్రికులు తమ పర్యటనలను మధ్యలోనే ముగించుకుని వెనక్కి వస్తున్నారు. గత ఆరు రోజుల వ్యవధిలో 1,000 మందికి పైగా భారత పౌరులు వాఘా సరిహద్దు చెక్పోస్ట్ ద్వారా స్వదేశానికి తిరిగి వచ్చినట్లు ఒక ప్రభుత్వ అధికారి తెలిపారు. ఇదే సమయంలో, భారతదేశంలో ఉన్న పాకిస్థానీయులు కూడా తమ దేశానికి తిరిగి వెళుతున్నారు. గత ఆరు రోజుల్లో 800 మందికి పైగా పాకిస్థానీ పౌరులు వాఘా మార్గం ద్వారా స్వదేశానికి చేరుకున్నారని సదరు అధికారి వివరించారు. ఒక్క ఆదివారం రోజే 115 మంది భారతీయులు పాకిస్థాన్ నుంచి రాగా, 236 మంది పాకిస్థానీయులు భారత్ నుంచి వెళ్లినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ పరిణామాల మధ్య ఇరు దేశాలకు చెందిన దీర్ఘకాలిక వీసాలు కలిగిన వారు స్వదేశాలకు తిరిగి వెళ్లే విషయంలో కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నట్లు కూడా అధికారి తెలిపారు. ఇరు దేశాల మధ్య రాకపోకలపై ప్రస్తుత ఆంక్షలు లేదా నిబంధనల మార్పులు వీరి ప్రయాణాలకు ఆటంకం కలిగిస్తోందని సమాచారం. సరిహద్దుల వద్ద ప్రయాణికుల రద్దీ పెరగడంతో పాటు, వీసా సంబంధిత సమస్యలు కూడా తలెత్తుతున్నాయని సమాచారం.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073